# పాకిస్తాన్‌లో పదిరోజులు




ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

# పాకిస్తాన్‌లో
# పదిరోజులు




**ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్**

**లోక్‌నాయక్ ఫౌండేషన్**, విశాఖపట్నం

# పాకిస్తాన్‌లో పదిరోజులు

రచయిత :
**ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్**

ప్రచురణ:
**లోక్‌నాయక్ ఫౌండేషన్**
విశాఖపట్నం

మూల్యం : **రూ. 75/-**

ప్రథమ ముద్రణ:
నవంబర్, 2011

ప్రతులు : 2000

ముద్రణ:
**సాయిలిఖిత ప్రింటర్స్**
ఖైరతాబాద్, హైదరాబాద్.

ప్రతులకు :

* **విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
  అన్ని బ్రాంచ్‌లు

* **లోక్‌నాయక్ ఫౌండేషన్**
  ఇంజనీరింగ్ కాలేజ్ స్టాఫ్ క్వార్టర్స్
  విశాఖపట్నం - 530 003.
  ఫోన్: 98490 67343

# అంకితం



గుండెలు 'కాచే' బంటు

'పద్మశ్రీ' **డా॥ భూపతిరాజు సోమరాజు** గారికి

గౌరవ పురస్సరంగా...

# విషయసూచిక


- పాకిస్తాన్ .............. 1 - 18
- కరాచి .............. 19 - 32
- హైదరాబాద్ (సింధ్) .............. 33 - 42
- ఇస్లామాబాద్ .............. 43 - 57
- లాహోర్ .............. 57 - 71
- పాకిస్తాన్ : నా ఆలోచనలు - అనుభవాలు .............. 72 - 92

# పాకిస్తాన్‌లో పదిరోజులు

మనం చదువుతున్న చరిత్రలో అధికభాగం నిజంగా ప్రజల చరిత్ర కాదు. రైతులు, కార్మికులు, కూలీలు, రాళ్లు కొట్టేవారు, ఇళ్లు కట్టేవారు, గుమస్తాలకు చెందిన చరిత్ర కాదు. ఈ చరిత్ర విప్లవకారులదీ కాదు. గాయకులదీ కాదు. కళాకారులదీ కాదు. శిల్పులదీ కాదు. మేధావులదీ కాదు. అంటే మన ముందున్న చరిత్ర మానవజాతి వాస్తవ చరిత్ర కానేకాదు. "ప్రభువెక్కిన పల్లకీ కాదోయ్.. అది మోసిన బోయీలెవ్వరు. తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెవ్వరు. ఈ రాణీ ప్రేమ పురాణం.. ఈ ముట్టడికైనా ఖర్చులు. తారీఖులు దస్తావేజులు .. ఇవి కాదోయ్ చరిత్రకర్థం" అన్నారు శ్రీశ్రీ తన దేశ చరిత్రలు అన్న కవితలో. పాలకులు, రాజకీయ మేధావులు, ప్రభుత్వానికి చెందిన వంధిమాగధులు తమకనుకూలంగా ఈ చరిత్రలోని ఎక్కువ భాగాన్ని సృష్టించారు లేదా ప్రభావితం చేశారు.

పాకిస్తాన్ చరిత్ర కూడా అంతే. దేశ విభజన ఫలితంగా ఏర్పడిన పాకిస్తాన్ గురించి మనకు ఏకపక్ష కథనాలు మాత్రమే వినిపిస్తున్నాయి. విభజన సందర్భంలో జరిగిన అనేక ఘట్టాల గురించి అటు పాకిస్తాన్‌లోనూ, ఇటు భారతదేశంలోనూ వేర్వేరు కథనాలు వినిపిస్తాయి. అసలు రెండు దేశాల ప్రజలు ఏమనుకుంటున్నారో అన్న దానికి ఈ చరిత్రలో అర్థం లేదు. అందుకే చరిత్రను మనం తిరగరాయాల్సి ఉంది. తప్పుడు సమాచారాన్ని సరిదిద్దాల్సి ఉంది. చరిత్రలో మనం ఎన్నో తప్పులు చేసి ఉండొచ్చు. కానీ, దేన్ని మర్చిపోవాలో, దేన్ని గుర్తుంచుకోవాలో తెలియకపోతే వర్తమానం భవిష్యత్తులోకి సరిగా పయనించలేదు. ప్రజా దృక్పథంతో మనం చరిత్రను తిరగరాయాల్సి ఉంటుంది.

1947 వేసవి కాలం. భారత పాకిస్తాన్‌ల మధ్య దేశ విభజన అప్పుడే పూర్తయ్యింది. ఈ విభజనలో పది లక్షల మంది ఊచకోతకు గురయ్యారు. పంజాబ్‌లోని మనోమజ్రా గ్రామంలో ఒకరోజు ఒక రైలు ప్రవేశించింది. ఆ రైలు చేసింది ప్రయాణం కాదు.

అంతిమయాత్ర. ఎందుకంటే ఆ రైలు నిండా ప్రయాణీకుల శవాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. వారు ప్రయాణీకులు కారు. శరణార్థులు. ఈ రైలు ఆ గ్రామంలో కూడా మృత్యువును సృష్టించింది. ఒకే రాత్రిలో చిత్రవధలు, గృహదహనాలు, అత్యాచారాలు పెద్ద ఎత్తున జరిగాయి. కొన్ని వందల సంవత్సరాలుగా హిందూ, ముస్లింలు శాంతియుతంగా జీవిస్తున్న గ్రామంలో జరిగిన దారుణ మారణకాండ ఇది. దేశంలో ప్రముఖ జర్నలిస్టుగా గుర్తింపు పొందిన కుష్వంత్‌సింగ్ రచించిన ప్రఖ్యాత నవల 'పాకిస్తాన్‌కు రైలు' (ట్రైన్ టు పాకిస్తాన్) అన్న పుస్తకంలో ఈ ఘట్టాల్ని కళ్లకు కట్టినట్లు వివరించారు.

పాకిస్తాన్ గురించి విన్నప్పుడల్లా నా కళ్లముందు కుష్వంత్‌సింగ్ నవలలోని ఘట్టాలే మెదులుతాయి. దేశ విభజన తాలూకు దారుణాల గురించి నేను సాదత్ హసన్‌మాంటో కథల్లో కూడా చదివి చలించిపోయాను. 42 ఏళ్ల వయస్సులోనే మరణించిన మాంటో ప్రపంచంలో ఉత్తమ సాహిత్యాన్ని సృజించారు. పంజాబ్‌లోని లూధియానాలో జన్మించిన మాంటో దేశ విభజన తర్వాత లాహోర్‌లో స్థిరపడేందుకు వెళ్లారు. ఆయన కథలు, ముఖ్యంగా ఖోల్‌దో (తెరువు) అన్న కథ ఆనాటి బీభత్సాన్ని కళ్లకు కట్టినట్లు వివరిస్తాయి.

అసలు మన దేశం మత ప్రాతిపదికన ఎందుకు విడిపోవాలి? లౌకికవాదిగా పేరుపొందిన మహమ్మద్‌అలీ జిన్నా అకస్మాత్తుగా మతతత్వవాదిగా మారి పాకిస్తాన్‌ను ఎందుకు డిమాండ్ చేసాడు? నిజానికి జిన్నా పాకిస్తాన్‌ను లౌకిక రాజ్యంగా మార్చాలని కలలు కన్నాడని నేను ఒక పుస్తకంలో చదివాను. దేశ విభజన తాలూకు ఘట్టాల గురించి విన్నప్పుడు ఆయన చలించిపోయాడని, తాను తప్పు చేశానని వాపోయాడని కూడా అంటారు. జిన్నా ఒక్కరే ఈ తపన పొందారా, ఇందులో బ్రిటీష్ పాలకుల హస్తం ఉందా, మన దేశ రాజకీయ నాయకులు కూడా వారితో గొంతుకలిపారా? అన్న అనుమానాలు చరిత్రలో వ్యక్తం కాకపోలేదు. ఏమైనప్పటికీ దేశ విభజన సందర్భంగా ఇరు దేశాల సరిహద్దుల్లోను, నగరాల్లోను జరిగిన హింసాకాండలో పది లక్షలమందికి పైగా దారుణంగా బలయ్యారు. దాని ప్రకంపనలు ఇప్పటికీ భారతదేశంలో వినిపిస్తున్నాయి. స్వతంత్ర భారతంలో హిందూ ముస్లింల మధ్య ఎన్నో మతకల్లోలాలు జరిగాయి. వేలాది మంది మరణించారు. ఇరు మతాల మధ్య ద్వేషభావాలు ఇప్పటికీ రగిలిపోతున్నాయి. ఇక పాకిస్తాన్ అయితే ఒక మతరాజ్యం, ఆ మతం ప్రబోధించిన శాంతి, విలువల ప్రకారం సుస్థిరంగా పాలన కొనసాగే బదులు అక్కడ ప్రజల జీవితాలు కూడా అల్లకల్లోలమయ్యాయి. మతాన్ని సాధనంగా ఉపయోగించుకుని సైనికపాలకులే కాదు, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన పాలకులు కూడా పాకిస్తాన్‌ను నిరంతర అగ్నిగుండంగా మార్చారు. అక్కడి రాజకీయ నాయకులు కూడా మన దేశ రాజకీయ నాయకుల మాదిరే ప్రజల్లో పొరుగుదేశం పట్ల ద్వేషభావాన్ని రేకెత్తింపజేసి తమ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా వినియోగించుకున్నారు. నిజానికి భారతదేశం

కేవలం ఉత్తరాదికి చెందిన రాష్ట్రమే అయ్యుంటే అదొక హిందూ రాజ్యంగా లేదా హిందుస్తాన్‌గా మారి మత విద్వేషంతో కనలిపోయి ఉండేదని నాకు అప్పుడప్పుడూ అనిపిస్తుంది. అదృష్టవశాత్తూ దక్షిణాదితో పాటు అనేక రాష్ట్రాలు చేరటం వల్ల భారతదేశం స్థూలంగా లౌకిక రాజ్యంగా మారింది. అందువల్ల పాకిస్తాన్‌కు విభిన్నమైన పాలన ఇక్కడ ఏర్పడగలిగింది.

నేను కనీసం 50 దేశాలు ఇప్పటివరకు తిరిగి ఉంటాను. కాని పాకిస్తాన్ మాత్రం సందర్శించలేదు. రాజ్యసభ సభ్యుడిగా ఉన్నప్పుడు మాత్రం రక్షణ మంత్రిత్వ శాఖ పార్లమెంటరీ కమిటీ సభ్యుడిగా అమృత్‌సర్ వద్ద ఉన్న వాఘా సరిహద్దు దాటి పాక్ కమాండర్లతో కరచాలనం చేశాను. భారత పాకిస్తాన్ దేశాల మధ్య ఉన్న వైరం, కార్గిల్‌లో చొరబాట్లు, దేశంలో పలు చోట్ల పాక్ ప్రేరిత ఉగ్రవాదుల దాడులు వీటన్నిటి గురించి తెలిసిన తర్వాత పాకిస్తాన్ అంటే నాలో ఒక వైముఖ్య భావం నెలకొంది. ఒక మతరాజ్యంలో రాజకీయ పరిస్థితులు ఎలా ఉంటాయో అన్న దానికి పాకిస్తాన్ ఒక ఉదాహరణగా మిగిలిపోయింది. అయితే చాలామందికి తెలియని విషయం ఏమిటంటే పాకిస్తాన్ మత రాజ్యం కావొచ్చు. కానీ, పాకిస్తాన్ ప్రజలు మాత్రం కాదు. మనలో చాలామందికి అక్కడ ఉన్న వారందరూ మతోన్మాదులని, మధ్యయుగాలకు చెందిన వారని, ఆధునిక భావాలకు అతీతులైనవారనే అభిప్రాయం అంతర్లీనంగా నెలకొంది. బహుశా ఇవే భావనల వల్లే నాకు కూడా తొలుత పాకిస్తాన్‌కు వెళ్లాలని అంతగా అనిపించలేదు. కాని రచయితగా, రాజ్యసభ సభ్యుడుగా ఢిల్లీలో నా ప్రపంచం విస్తరించింది. అనేకమంది మేధావులు, రచయితలతో సంబంధాలు ఏర్పడే అవకాశం లభించింది. సార్క్ రచయితల సంఘంతో నా సంబంధాల వల్ల కూడా నా దృక్పథం విశాలంగా మారింది. పాక్ నుండి వచ్చిన అనేకమంది ప్రజాప్రతినిధులు, రచయితలను చూసినప్పుడు మన దేశంలో మేధావులు, ప్రజాప్రతినిధులకు వీరు భిన్నం ఏమీ లేరే.. అని నాకు ఆశ్చర్యం కలిగేది. ఢిల్లీలోని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో పాక్ వెళ్లివచ్చిన జర్నలిస్టులు చెప్పే కథనాలు, పాక్ గురించి నేను ఊహించుకున్న విషయాలకు భిన్నంగా ఉండేవి. ముఖ్యంగా అక్కడి నుంచి భారత దేశానికి తరచూ వచ్చే మానవ హక్కుల కార్యకర్త, ప్రముఖన్యాయవాది అస్మా జహంగీర్ తమ దేశంలో విధానాల్ని ధైర్యంగా విమర్శించిన తీరు నాకు అబ్బురం కలిగించేది. నస్రత్ ఫతే అలీఖాన్ వంటి పాక్ గాయకులు పాడే సూఫీ గీతాలకు నేను మైమరిచిపోతుంటాను.

పాకిస్తాన్‌పై నాకున్న అభిప్రాయాన్ని మార్చిన వారిలో ప్రధానంగా ముగ్గురు ప్రముఖులున్నారు. వారిలో ప్రముఖ జర్నలిస్టు కుల్దీప్ నయ్యర్ ఒకరు. ఆయన నాతో పాటు రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. కుల్దీప్ నయ్యర్ భారత ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయిని పాకిస్తాన్‌కు బస్సు యాత్రకు వెళ్లమని ప్రేరేపించి, తను కూడా ఆయనతో వెళ్లి ఇరు దేశాల మధ్య సంబంధాలు పునరుద్ధరించే క్రమంలో కీలక పాత్ర



శ్రీ కులదీప్ నయ్యర్



శ్రీ కుష్వంత్ సింగ్



శ్రీ ఎల్.కె. అద్వానీ

పోషించారు. పాకిస్తాన్‌లోని సియాల్ కోట్‌లో జన్మించిన కుల్దీప్ నయ్యర్ విభజన సమయంలో వాఘా సరిహద్దు గుండా దేశం దాటి భారత దేశంలో అడుగుపెట్టాడు. దారిపొడుగునా ప్రజలు ఒకర్నొకరు ఊచకోత కోసుకోవటం, పిల్లలు, మహిళలపై దారుణ అత్యాచారాలు జరగడం కళ్లారా చూశారు. భారత, పాకిస్తాన్ దేశాలు స్నేహపూర్వకంగా ఉంటాయని, ఇరు దేశాలు కలిసికట్టుగా పరస్పర అభివృద్ధికోసం కృషి చేస్తాయని పాక్ అధ్యక్షుడు మహమ్మదాలీ జిన్నా చెప్పిన మాటలు వృధా అయ్యాయని ఆయనకు కాల క్రమేణా అర్థమయింది. విభజన తర్వాత రగిలిన మతద్వేషాల్లో భాగంగా జరిగిన మహాత్మాగాంధీ హత్యను, ఆ తర్వాతి పరిణామాల్ని వార్తల్లో విశ్లేషించిన జర్నలిస్టు ఆయన. ఆయన రచించిన 'స్కూప్' పుస్తకాన్ని నేను 'కథనాల వెనుక కథలు' అన్న పేరుతో అనువదించాను. ఢిల్లీ వచ్చినప్పుడల్లా నేను ఆయనను కలుసుకుంటుంటాను. 2010 జనవరి నెలలో ఒకరోజు ఢిల్లీలో ఆంధ్రజ్యోతి ఢిల్లీ బ్యూరో ఛీఫ్ ఎ.కృష్ణారావుతో పాటు ఆయనను కలుసుకున్నప్పుడు ఆయన నేతృత్వంలో భారత దేశం నుంచి శాంతి ప్రతినిధి వర్గం ఒకటి పాకిస్తాన్‌లో ముఖ్యమైన ప్రాంతాలు సందర్శిస్తున్నట్లు తెలుసుకున్నాను. 'మీరు కూడా వస్తారా...' అని ఆయన మమ్మల్ని అడిగారు. మేము వెంటనే అందుకు అంగీకరించాం. పాకిస్తాన్ పట్ల నాలో ఉన్న అభిప్రాయాలు, కుల్దీప్ నయ్యర్ వంటి ప్రముఖులు చెబుతున్న విషయాలను బేరీజు వేసుకునేందుకు ఇదే మంచి సమయం అనిపించింది. అంతేకాదు, బిజెపి మాజీ అధ్యక్షుడు లాల్‌కృష్ణ అద్వానీ ఆత్మకథ 'నాదేశం-నా జీవితం'లో పాకిస్తాన్ పర్యటనలో ఆయనకు ఎదురైన అనుభవాలను విస్తృతంగా వివరించారు. ఈ ఆత్మకథను నేను తెలుగులోనికి అనువదించిన రీత్యా పాకిస్తాన్ చూడాలని నాకు మరింత ఆసక్తి కలిగింది. కరాచీలో జన్మించిన అద్వానీ కూడా దేశ విభజన సమయంలో కట్టుబట్టలతో భారత దేశానికి రావలసి వచ్చింది. ఆయన కూడా విభజన సమయంలో జరిగిన హింసాకాండకు ప్రత్యక్ష సాక్షులే. ఇక మూడో వ్యక్తి కుష్వంత్ సింగ్. ఆయన కూడా కుల్దీప్‌నయ్యర్, అద్వానీల మాదిరే దేశ విభజన సమయలో భారత దేశానికి వచ్చిన వారే. పాకిస్తాన్‌లోని పంజాబ్‌లో హదాలీలో జన్మించిన కుష్వంత్ సింగ్ లాహోర్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. దేశ విభజన తర్వాత ఆయన తన కుటుంబాన్ని కారులో ఎక్కించుకుని భారత దేశానికి వస్తుండగా, ఒక జీపులో సాయుధులైన సిక్కులు కనపడ్డారు. ఒక గ్రామంలో ముస్లింలదర్నీ తాము చంపేశామని వారు సగర్వంగా చెప్పుకుంటుంటే విని కుష్వంత్ సింగ్ చలించిపోయారు. అదే ఆయన 'ట్రైన్ టు పాకిస్తాన్' రచనకు కారణమైంది. నాకంటే ఎంతో ముందు రాజ్యసభ సభ్యుడుగా ఉన్న కుష్వంత్ సింగ్‌ను కూడా నేను అప్పుడప్పుడూ కలుసుకునే వాడిని.

నా అధ్యయనం, వీరందరితో తరచూ చేసే సంభాషణల ద్వారా నేను గ్రహించిన విషయం ఏమంటే మన దేశ ప్రజల మాదిరిగానే, పాకిస్తాన్ ప్రజలందరూ ఒకే విధంగా

ఆలోచించటం లేదు. ఇరు దేశాల్లో ఉన్న వేలాది మంది ప్రజలు ఒకర్నొకరు కలుసుకోవాలని తపిస్తున్నారు. ఆర్థికంగా వెనుకబాటుతనం ఉన్నప్పటికీ, నిరంతర హింసాత్మక ఘటనలు జరుగుతున్నప్పటికీ, అవినీతి పెచ్చరిల్లినప్పటికీ, పేదలు, మహిళల పట్ల తీవ్ర అణచివేత కొనసాగుతున్నపటికీ, అత్యంత ప్రమాదకరమైన ఉగ్రవాద శక్తులు అక్కడ విచ్చలవిడిగా తిరుగుతున్నప్పటికీ, మన దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలకు పాక్‌లో చేయూతనిస్తున్నప్పటికీ, పాకిస్తాన్ ముందుకు సాగుతున్న దేశమే కానీ వెనక్కు మళ్లుతున్న దేశం కాదన్న అభిప్రాయం నాలో బలంగా నెలకొంది. మనదేశం కంటే అక్కడ సంస్కరణలు ముందుగా అమలయ్యాయి. అనేక ఆధునిక విధానాలు విజయవంతమైన దాఖలాలున్నాయి. అద్భుతమైన పరిపాలనా సంస్కరణలూ జరిగాయి. చెప్పుకోదగ్గ విధంగా పారిశ్రామిక రంగమూ, రవాణా రంగమూ అభివృద్ధి చెందాయి. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రహదారులూ అభివృద్ధి చెందాయి. దక్షిణాసియాలోనే ఉత్తమమైన విద్యనందిస్తున్న లాహోర్ యూనివర్శిటీ వంటి విశ్వవిద్యాలయాలు కూడా పాకిస్తాన్‌లో ఉన్నాయి. పట్టణాల్లో యువత ఆధునిక జీవితాలకు అలవాటు పడ్డారు.

ఒక మతరాజ్యంలో ఇలాంటి పరిణామాలు జరగటం సాధ్యమా? అన్న ఆశ్చర్యం నాకు కలిగినప్పుడల్లా పాకిస్తాన్‌ను సందర్శించాలనే అభిప్రాయం బలపడటం కొనసాగింది. ఇస్లామిక్ తీవ్రవాదానికి, ముస్లిం జాతీయ వాదానికీ తేడాను అర్థం చేసుకోకపోతే పాకిస్తాన్‌ను అర్థం చేసుకోవటం కష్టమనే అభిప్రాయం నాకు అప్పటికే కలిగింది.

నిజానికి పశ్చిమ పాకిస్తాన్ అంటే ఇప్పుడున్న పాకిస్తాన్ దేశంలో ఏ కోణం నుంచి చూసినా ఒక సహజ ఐక్యత ఉంది. సంస్కృతి, జాతి, చరిత్ర మొదలైన అనేక విషయాల్లో బ్రిటీష్ పాలనకు ముందే ప్రస్తుత పాకిస్తాన్ ప్రాంతంలో ఒక సమానమైన ఐక్యత నెలకొని ఉంది. కనుక బంగ్లాదేశ్‌కు భిన్నంగా పాకిస్తాన్‌కు సమానమైన స్వతంత్రమైన లక్షణాలు ఉన్నాయని ఆ దేశాన్ని సందర్శించిన వారికి ఎవరికైనా అనిపిస్తుంది. పాకిస్తాన్ అన్న పదాన్ని 1933లో బ్రిటన్‌లో చదువుకుంటున్న ఒక భారతీయ ముస్లిం యువకుడు కనిపెట్టాడు. అప్పటి బ్రిటీష్ భారత సామ్రాజ్యానికి నైరుతి దిశగా పంజాబీలు, పఠాన్‌లు, కాశ్మీరీలు, సింధీలు, బెలూచిస్తాన్‌లు కలిసి ఒక ముస్లిం రాజ్యంగా ఏర్పడాలని, దానికి పాకిస్తాన్ అన్న పేరు పెట్టాలని ఆ విద్యార్థి కలలు కన్నాడు. ఉర్దూలో పాక్ అంటే స్వచ్ఛత అని అర్థం. పాకిస్తాన్ అంటే స్వచ్ఛమైన భూమి అని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. అప్పుడు కూడా ఆ ముస్లిం విద్యార్థి తాను కలలు కన్న రాజ్యంలో తూర్పు బెంగాల్ ఉండాలని భావించలేదు. నిజానికి ఒక భూభాగానికి, మరొక భూభాగానికీ వేయి మైళ్లకు పైగా తేడా ఉన్నప్పుడు ఆ రెండు భూభాగాలూ కలిసి ఒకే భూభాగంగా, ఒకే దేశంగా మనుగడ సాగించటం కష్టమని ఎవరైనా చెప్పగలరు. పశ్చిమ పాకిస్తాన్‌లో ఆధిపత్యం

వహిస్తున్న పంజాబీలు, పఠాన్‌లు ఎప్పుడూ తూర్పు బెంగాలీలను తమ స్వదేశస్థులుగా పరిగణించలేదు. కనీసం ముస్లింలుగానైనా వారిని గుర్తించలేదు.

పాకిస్తాన్ అధికార భాషగా స్వీకరించిన ఉర్దూ కూడా నిజానికి అక్కడ స్థానికులు మాట్లాడే భాష కాదు. ఉర్దూ అంటే టర్కీ-పర్షియన్ పరిభాషలో సైనిక క్యాంపు అని అర్థం. మధ్య యుగాల్లో భారతదేశానికి చెందిన ముస్లిం సైనికులు మాట్లాడే భాష అది. ఇందులో పర్షియన్, టర్కీ పదాలతో కూడిన స్థానిక హిందూస్తానీ మిశ్రమం కనిపిస్తుంది. బెంగాల్‌లో ముస్లింలు ఈ భాషలో ఎప్పుడూ మాట్లాడలేదు. పాకిస్తాన్‌లో కూడా అత్యధికులు ఈ భాషలో మాట్లాడేవారు కూడా కాదు. భారతదేశంలో ప్రస్తుతం ఉన్న ఢిల్లీ, ఆగ్రా, లక్నో, భోపాల్, హైదరాబాద్ నగరాల్లో అంటే పాత మొఘల్ సామ్రాజ్యంలో ముస్లింలు మాట్లాడే భాష అది. ఈ భాష ఇప్పుడు పాకిస్తాన్‌లో అధికార భాష, దేశ విద్యావ్యవస్థలో ఉపయోగించే భాష కూడా ఇదే. పాకిస్తాన్ జాతీయ దినపత్రికలు, సినిమా పరిశ్రమ వాడే భాష కూడా ఉర్దూయే. కానీ, విచిత్రం ఏమిటంటే 1947లో దేశ విభజన తర్వాత పాకిస్తాన్‌కు వలస వచ్చిన ముజాహిర్లు తమ ఇంటి వద్ద ఉర్దూ భాష మాట్లాడతారు. పాకిస్తాన్ జనాభాలో వారు ఏడు శాతం మాత్రమే ఉన్నారు. అంటే, కేవలం ఏడు శాతం ప్రజలు మాట్లాడే భాషే మొత్తం పాకిస్తాన్ జాతీయ భాషగా మారిందన్నమాట.

ఐతే, సింధూలోయ నాగరికత మూలంగా పాకిస్తాన్‌కు భౌగోళిక ఐక్యత ఉంది. అక్కడి పర్వతాలూ, ఎడారులూ, అడవుల్లో రకరకాల జాతులు కొన్ని దశాబ్దాలుగా జీవిస్తున్నారు. కొన్ని వందల సంవత్సరాలుగా ఒకే ముస్లిం పాలకులు వారిని పాలించారు. అందువల్ల వారు జాతుల ప్రమేయం లేకుండా ముస్లింలుగానే ఉండిపోయారు. వారు ఇస్లాంకు చెందిన రకరకాల పద్ధతులను ఆచరిస్తారు. రకరకాల సాధువుల్ని కొలుస్తారు. అందువల్ల పాకిస్తాన్‌లో కలసికట్టుగా ఒక విప్లవం అంటూ సాధ్యం కానే కాదని ఒక రచయిత అభిప్రాయపడ్డారు.

స్థూలంగా పాకిస్తాన్ పరిణామాలను మూడు దశలుగా అభివర్ణించవచ్చు. మొదటి దశను దేశ నిర్మాణ దశ లేదా ఆధునిక దశగా అభివర్ణించవచ్చు. 1947-71 మధ్య కాలంలో పాకిస్తాన్ ఒక సమాజంగా, ఒక రాజ్యంగా తనను తాను నిర్మించుకుంది. పాకిస్తాన్ సంస్థాపకుడు జిన్నా యూరోపియన్ తరహాలో దేశాన్ని నిర్మించాలనుకున్నారు.

"మా దేశంలో హిందువులు హిందువులుగా, ముస్లింలు ముస్లింలుగా ఉండరు. అందరూ రాజకీయ పరిభాషలో ముస్లింలుగానే గుర్తింపు పొందుతారని" ఆయన చెప్పారు. విభజన సందర్భంగా ఎంత ఊచకోత జరిగినప్పటికీ తొలి దశాబ్దాల్లో పాకిస్తాన్‌లో మతసామరస్యం, పరస్పర సహనం నెలకొని ఉండేవి. ఆధునిక పథంలో పాకిస్తాన్ ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం పరుగులు తీసింది. అయితే పాకిస్తాన్,

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=595**